
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



రసవత్తరంగా నృత్యరూపకం
విశాఖ నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపకం నయనానందకరం సాగింది. 8లో



వెంకన్నకు పుష్పాభిషేకం
గాజువాక (విశాఖ): ప్రసన్న వేంకటేశ్వరాలయంలో స్వామివారికి సామూహిక లక్ష తులసి అర్చన పూజలు ఘనంగా నిర్వహించారు.



తీరం కోత తీవ్రతరం
విశాఖ: సముద్ర తీరంలో కోత తీవ్రమవుతోంది. తాజాగా బీచ్‌రోడ్డులో పలు కొబ్బరి చెట్లు భారీ కెరటాల తీవ్రతకు నేలకూలాయి.



అరకు ఏరియా ఆసత్రిలో రోగికి రొట్టె అందజేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబు



రంపచోడవరం ఏరియా ఆసత్రిలో రొట్టె అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



ఇసుకలు గ్రామంలో పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

జగన్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- ఘనంగా పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- పేదలకు రగ్గులు, పిల్లలకు స్కూల్ బ్యాగ్‌లు, రోగులకు రొట్టెల పంపిణీ
- జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టిన పార్టీ శ్రేణులు, అభిమానులు

పాడేరు: రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేవారని, నేడు కూటమి ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితి లేకుండా పోయిందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు విమర్శించారు. శనివారం ఆయన అధ్యక్షతన పాడేరులో జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం మండలంలోని కుజ్జెలి పంచాయతీ ఇసుకలు గ్రామంలో స్థానిక గిరిజనులతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. ఇసుకలు, చీడిమెట్ట గ్రామాల గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. గిరిజన సంప్రదాయ థింసా నృత్యాలతో సందడి చేశారు. అనంతరం వంతాడపల్లి బీవీకే పాఠశాలలో అనాథ పిల్లలకు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు రగ్గులు, స్కూల్ బ్యాగ్‌లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు ప్రతిఒక్కరూ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కూడా సురేష్‌కుమార్, కిల్లు కోటిబాబు నాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు కురుసా పార్వతమ్మ, మండల సర్పంచ్‌ల పోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, ఎంపీటీసీ కుంతూరు నర్సింహమూర్తి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.





జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుక సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల సమక్షంలో కేక్‌ను కట్‌చేస్తున్న అరకు, పాడేరు ఎమ్మెల్యేలు మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు

అరకులోయ టౌన్: సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. శనివారం ఆయన అధ్యక్షతన అరకులో జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దివంగత సీఎం వైఎస్ కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి వేడకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా ప్రజలకు సంక్షేమ పాలన అందించారన్నారు. గిరిజన ప్రాంత ప్రజలు, నాయకులు ఎప్పుడూ ఆయన వెంట ఉంటారన్నారు. మళ్లీ సీఎంను చేసేందుకు అదివాసీ బిడ్డలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం లేని లోటు ఈ ఆరు నెలల్లో స్పష్టంగా కనిపించిందన్నారు.వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత ఐదేళ్లలో సుపరిపాలన అందించిన జగనన్న ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. ఎన్నికల హామీలను విస్మరించి అరాచక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ ఎంపీపీలు ఉషారాణి, నీలవేణి, ఈశ్వరి, డుంబ్రిగుడ జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీటీసీలు ఎల్‌బీ భీమరాజు, శత్రుఘ్న, ఆనంద్‌కుమార్, సింహాచలం, సుశీల, సర్పంచ్‌లు సుష్మిత, బుటికి, ఎం. జ్యోతి, భాస్కర్‌రావు, రాధిక, జీనబందు, పూర్ణిమ, వైస్ ఎంపీపీలు కిల్లో రామన్న, ఆనంద్, జయవర్ధన్, వైఎస్సార్‌సీపీ మేధావుల వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజరమేష్ బోష్, పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శులు జర్సింగి సూర్యనారాయణ, పాంగి చిన్నారావు, సంయుక్త కార్యదర్శి నర్సింహ మూర్తి, పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, మల్లేశ్వరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కిరణ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే సంక్షేమం

రంపచోడవరం: వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందాయని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు మన్యంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గిరిజనులకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు రంపచోడవరంలో మల్టీపర్పస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తీసుకువచ్చి, నిర్మాణం ప్రారంభించిన ఘనత తమ పార్టీకి దక్కుతుందన్నారు. కొత్త పీహెచ్‌సీలు ఏర్పాటుతో గిరిజనులకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. గిరిజనుల గుండెల్లో వైఎస్సార్ సీపీ ఎప్పుడు పదిలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, వైస్ ఎంపీపీ పండా కుమారి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, వంశీ కుంజం, సర్పంచ్ మిర్తివాడ ఆనంద్‌రెడ్డి, ఉప సర్పంచ్ వీఎం కన్నబాబు, సీతపల్లి బాపనమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ బొబ్బా శేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే ‘మన ఎమ్మెల్యే మా ఊరు’

- ప్రజల దృష్టికి కూటమి మోసపూరిత హామీలు
- పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- కుజ్జెలి పంచాయతీ ఇసుకలు గ్రామంలో ప్రారంభం
- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం



మన ఎమ్మెల్యే మా ఊరు కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : గ్రామాలను సందర్శించి స్థానిక గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్న లక్ష్యంతో ‘మన ఎమ్మెల్యే మా ఊరు’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు వెల్లడించారు. శనివారం ఆయన మండలంలోని కుజ్జెలి పంచాయతీ మారుమూల ఇసుకలు గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక గిరిజనులతో మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, సీసీ రోడ్డు, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, జన్‌మన్ పథకంలో కొంతమందికి మాత్రే ఇళ్లు మంజూరు అయ్యాయని వారు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే ఆయన తాగునీటి సమస్యపై అక్కడి నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే జల్‌జీవన్ మిషన్ పథకంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఇతర సమస్యలను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని గిరిజనులకు ఆయన భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లోని అన్ని గ్రామాల్లో తాను పర్యటిస్తానని చెప్పారు. ప్రధానంగా ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలకు వివరిస్తాన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, ఎంపీటీసీ కుంతూరు నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పార్టీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు కురుసా పార్వతమ్మ, పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభం



క్యాంప్ కార్యలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రవిబాబు తదితరులు

అరకులోయ టౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం క్యాంప్ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు శనివారం ప్రారంభించారు. స్థానిక రెంటల్ హౌసింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మత్స్యలింగం, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లి పల్లి సుభద్ర, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రోగుల భోజనంలో రాళ్లు

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడి

అరకులోయ టౌన్: రోగులకు ప్రతిరోజు అందించే అన్నంలో ప్రతిరోజు రాళ్లు ఉంటున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను వైద్యాధికారి హరి తదితరుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులను విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తే 108 అంబులెన్స్‌లో ఎస్.కోట వరకు తీసుకువెళ్లి అక్కడ దించేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకనుంచి ఇలాంటి పరిస్థితి లేకుండా చూడాలని ఆమె ఆదేశించారు. ఆస్పత్రిలో జరుగుతున్న ప్రసవాల వివరాలను తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యమైన బియ్యంతో రోగులకు భోజనాలు వండి వడ్డిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం నాణ్యతలేని భోజనాలు పెడుతూ రోగులను మరింత అనారోగ్యానికి గురిచేస్తుందన్నారు. రోగులకు మంచి ఆహారాన్ని అందించాలని, కేజీహెచ్‌కు రిఫర్ చేసిన రోగులకు నేరుగా అక్కడికి తీసుకువెళ్లాలని ఆదేశించారు.

పీఎం జన్‌మన్ పథకంలో రోడ్లు నిర్మిస్తాం

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- బల్లగరువులో పర్యటన
- రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



గిరిజన గ్రామాలకు వెళ్తున్న డిప్యూటీ సీఎం పవన్ పవన్ కల్యాణ్, అధికారులు

సాక్షి, పాడేరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జనమన్ పథకంలో వందకంటే ఎక్కువ జనాభా కలిగిన ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కె. పవన్ కల్యాణ్ తెలిపారు. శనివారం ఆయన అనంతగిరి మండలం పినకోట గ్రామ పంచాయతీ బల్లగరువులో పర్యటించారు. ఈ సందర్భంగా 19 రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నిర్మాణాలు పూర్తయితే 4,500 మంది జనాభాకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా అరికట్టాలని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. గంజాయి వల్ల యువతలో నేర ప్రవృత్తి పెరుగుతుందన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. వందమంది కన్నా తక్కువ జనాభా గల గ్రామాల్లో కూడా రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జీవో నంబరు 3 విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా పండించే కాఫీ, సిరి ధాన్యాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ముందుగా గ్రామంలో పర్యటించిన ఆయన పలు సమస్యలు తెలుసుకున్నారు. వేదిక వద్ద వివిధ ప్రభుత్వ శాఖల ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఆర్టీసీ డైరెక్టర్ నిమ్మ గంగుదొర పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై 27న నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపు

అరకులోయ టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27న చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యేరేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. శనివారం జరిగిన పార్టీ కార్యకర్తలు, నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరకులోయ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత యూనిట్‌కు 55 పైసల చొప్పున పెంచడం అత్యంత దారుణమని విమర్శించారు. కరెంట్ చార్జీల పెంపు విషయాన్ని ప్రతీ గ్రామానికి వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. పెంచిన చార్జీలు తగ్గించే వరకు కూటమి ప్రభుత్వంపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పార్టీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

అడిషనల్ డీఎంహెచ్‌వోలుగా పెంచలయ్య, ప్రభావతి

మహారాణిపేట (విశాఖ): నెల్లూరు జిల్లా డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.పెంచలయ్య అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అడిషనల్ డీఎంహెచ్‌వోగా నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఓ.ప్రభావతిని అడిషనల్ డీఎంహెచ్‌వో(టీ)గా నియమించారు. ఈమేరకు ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

పథకాలు సక్రమంగా అమలు

- ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు



సమీక్షిస్తున్న ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు

చింతూరు: ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అందించే ట్రైకార్ పథకాలను సక్రమంగా అమలుచేయాలని ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఐటీడీఏలో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇచ్చి ట్రైకార్ రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీనిద్వారా గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయని ఆయన పేర్కొన్నారు. వివిధ పథకాలకు సంబంధించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ డైరెక్టర్లు కృష్ణారావు, లావణ్య, అనురాధ, ఎంపీపీ సవలం అమల పాల్గొన్నారు.

పాము కాటుకు బాలుడి మృతి

అడ్డతీగల: మండలంలో మట్లపాడు గ్రామానికి చెందిన ముర్రం సాయిదొర(6) అనే బాలుడు పాముకాటుకు గురై మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం ఆరుబయట ఆడుకుంటుండగా శరీరం, కళ్లు రంగుమారడాన్ని గమనించిన తండ్రి తమ్మన్నదొర పాముకాటుకు గురైనట్టు గుర్తించారు. వెంటనే అతనిని మండలంలోని ఎల్లవరం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం వైద్య సిబ్బంది సూచన మేరకు అడ్డతీగల సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు.ఎస్‌ఐ వినోద్ బాలుడు మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుప్పి కళేబరం స్వాధీనం

విచారణ ప్రారంభించిన అటవీశాఖ అధికారులు



ముంజవరప్పాడు అటవీ ప్రాంతంలో వివరాలు సేకరిస్తున్న అటవీశాఖ అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి అటవీక్షేత్రం పరిధి ముంజవరప్పాడు అటవీ ప్రాంతంలో వన్యప్రాణి దుప్పి కళేబరాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్టు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాము తెలిపారు. వన్యప్రాణిని వేటాడారన్న సమాచారం మేరకు అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు శనివారం సంఘటన ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు మొదలుపెట్టారు. దీనిలో భాగంగా కొంత మందిని ప్రశ్నించారు. తమ గ్రామానికి చెందిన ఎవ్వరూ వేటాడలేదని, మాపై నిందలు వేయవద్దంటూ ముంజవరప్పాడు గ్రామానికి చెందిన ఆదివాసీలు శనివారం మూకుమ్మడిగా స్థానిక అటవీక్షేత్ర కార్యాలయానికి తరలి వచ్చారు. ఆధారాలు లేకుండా కేసులు పెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. రాత్రి 10 గంటల వరకు కార్యాలయం వద్దనే వేచి ఉన్నారు. కాగా వన్యప్రాణి దుప్పిని వేటాడి హతమార్చిన ఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం వెల్లడిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

కాఫీ కొనుగోలుకు పెరుగుతున్న పోటీ

కాఫీ ఫలసాయం కొనుగోలుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పోటీపడుతుండటంతో రైతులకు మంచి ధర లభించే పరిస్థితి కనిపిస్తోంది. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో మ్యాక్స్ సంస్థ కొనుగోళ్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో మాతోట తదితర రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అంతర్జాతీయ మార్కెట్లో కాఫీ ధరలకు అనుగుణంగా రైతులకు చెల్లిస్తామని ప్రకటించాయి. గిరిజన సహకార సంస్థ కూడా ధరలు పెంచుతున్నట్టు ప్రకటించడంతో కాఫీ రైతుల్లో ఆనందం నెలకొంది.

- ముందుకు వస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలు
- అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా మెరుగైన ధర చెల్లిస్తామని ప్రకటన
- కొనుగోలు ధరలను సవరించిన జీసీసీ
- నెలాఖరు నుంచి కొనుగోలు చేస్తామని వెల్లడి



చింతపల్లిలో ఎకో పల్పింగ్ యూనిట్

చింతపల్లి: మన్యంలో కాఫీని సాగు చేస్తున్న గిరి రైతులకు మంచి రోజులు వచ్చాయి. అధిక ధరలకు కొనుగోలు చేస్తామని ప్రైవేట్ సంస్థలు ప్రకటించడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో 2.45 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. దీనిలో 1.48 లక్షల ఎకరాల్లో ఫలసాయం వస్తోంది. ఈ సాగుపై సుమారు 1.30 లక్షల మంది జీవనోపాధి పొందుతున్నారు. సుమారు 17వేల టన్నుల దిగుబడి వస్తోంది. ఈ ఏడాది పాడేరు డివిజన్ పరిధిలో పాడేరు, జి మాడుగుల, పెదబయలు, హుకుంపేట, అరకు, డుంబ్రిగుడ ప్రాంతాల్లో కాపు ఆశాజనకంగా ఉంది. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో దిగుబడి తగ్గే అవకాశం ఉందని కాఫీ బోర్డు అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది ఐటీడీఏ ఆధ్వర్యంలో 2 వేల టన్నుల కాఫీ పండ్ల కొనుగోలు లక్ష్యంగా మ్యాక్స్ సంస్థ ప్రకటించింది. కిలో రూ.44 చొప్పున ఇప్పటివరకు 330 టన్నుల కాఫీ పండ్లను కొనుగోలు చేసింది. గిరిజన సహకార సంస్థ ఈ ఏడాది పెంచిన ధరలను సవరించింది. పాడేరు డివిజన్‌లో మూడు రకాలు కలిపి 2వేల టన్నులు కొనుగోలు చేసేలా కార్యాచరణ రూపొందించింది. ఇలావుండగా కాఫీ కొనుగోళ్లకు సంబంధించి ఈ ఏడాది రైతు ఉత్పత్తిదారుల సంఘాలు దూకుడు పెంచాయి. జీసీసీ, మ్యాక్స్ ప్రకటించిన ధరల కన్నా ఇవి ప్రకటించిన ధరలు కాస్త ఎక్కువగా ఉన్నాయి. మాతోట, గంతన్నదొర, నాంది, కోవెల, మన్యతోరణం, ఆంధ్రా కశ్మీర్, అరుణతార, సుగుమన తదితర

మిగతా 8వ పేజీలో ▶

క్లుప్తంగా

40 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మోతుగూడెం: కారులో తరలిస్తున్న 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్టు డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. తమిళనాడుకు చెందిన ప్రకాష్ జ్యోతిపాస్,రాజమహేంద్రవరానికిచెందిన చల్ల రవీంద్రప్రసాద్ ఒడిశా రాష్ట్రం అల్లూరి కోట గ్రామంలో గంజాయిని కొనుగోలు చేసి కారులో బెంగళూరుకి తరలిస్తుండగా డొంకరాయి పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద తమ సిబ్బంది పట్టుకున్నట్టు తెలిపారు. వై.రామవరం ఎంపీడీవో రవికిషోర్ సమక్షంలో నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

వంటావార్పుతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



రోడ్డుపై భోజనం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

రంపచోడవరం: గురుకుల ఔట్‌సోర్సింగ్ టీచర్స్ నిర్వహిస్తున్న ఆందోళన 36వ రోజు కొనసాగింది. నిరాహార దీక్షలో భాగంగా శనివారం ఐటీడీఏ ఎదుట వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డుపైన భోజనాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తమ పోరాటానికి యూటీఎఫ్, సీపీఎం మద్దతు తెలిపాయని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ సభ్యుడు అనంతకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శామ్యూల్, తాతాజీ, సత్యనారాయణరెడ్డి, పాపాయమ్మ పాల్గొన్నారు.

రసవత్తరంగా నృత్యరూపకం

మద్దిలపాలెం (విశాఖ): కళాభారతి ఆడిటోరియంలో వార్షిక నృత్యోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపకం నయనానందకరం సాగింది. సెంట్రల్ సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత, కళారత్న బాలకొండలరావు శిష్య బృందం ఈ నృత్య రూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించింది. కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి గుమ్మాలూరి రాంబాబు, ముఖ్యఅతిథి ఎ.మధుకుమార్, బాలకొండలరావు, టీకుముళ్ల శ్యామల జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నృత్యకళాకారుల పదర్శించిన శ్రీకృష్ణ పారిజాతం నృత్యరూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

తాటి కమ్మ బంగారు పళ్లెం..
చారన్నమే విందు భోజనం

SUNDAY SPECIAL



మరో గ్రామానికి మకాం మార్చుతున్న కాపరులు

- గొర్రెలు, మేకలతో ఆరు నెలలు సంచారం
- నేల సారవంతం కోసం అన్నదాతల ఆదరణ
- కుటుంబానికి దూరంగా ఒంటరి జీవనం

పంటనిచ్చే నేలకు, అన్నం పెట్టే రైతన్నకు ప్రకృతి స్నేహితులు ఈ మందకాపరులు. ప్రపంచం ఆధునికత వైపు పరుగులు పెడుతుంటే మందకాపరుల జీవన శైలిలో ఏమాత్రం మార్పు రాలేదు. కుటుంబానికి తిండి గింజలు అందించేందుకు ఏడాదికి ఆరు మాసాలపాటు జిల్లాలు దాటి బయట ప్రాంతాల్లో సంచార జీవనం చేస్తారు. గొర్రెలు, మేకల మంద కొద్ది రోజులు పొలంలో ఉంటే వాటి మల మూత్రాల వల్ల సహజసిద్ధంగా నేల సారవంతమవుతుందని రైతులు వీరిని ఆదరిస్తుంటారు.



అన్నాన్ని తాటి బొల్లల్లో నింపుతున్న దృశ్యం

చీడికాడ: రైతులకు మేలు చేస్తూ అర్ధాకలితో మెలిగే మందకాపరుల జీవన శైలి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈకాలంలో కూడా ఇలాంటివి కొనసాగుతున్నాయా అనిపిస్తుంది. విశేషమేమిటంటే సంప్రదాయ సేంద్రియ వ్యవసాయానికి ఆదరణ పెరగడంతో ఈమధ్య కాలంలో మందకాపరులకు మరింత పని దొరికింది. ప్రతి ఏడాది విశాఖ జిల్లాలోని భీమిలి, పద్మనాభం, విజయనగరం జిల్లాలోని ఎస్.కోట మండలాల్లోని పలు గ్రామాల నుంచి దమ్ములు సమయంలో గడిచిన 20 ఏళ్లుగా గొర్రెలు, మేకలతో పొలాల్లో మందలు కాసేందుకు 40 కుటుంబాల వారు వస్తుంటారు. వీరు ఈ రెండు జిల్లాల్లోని అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, సబ్బవరం, చోడవరం, మాడుగుల, చీడికాడ, వేపాడ, ఎస్.కోట, దేవరాపల్లి, కె.కోటపాడు తదితర మండలాలను దాటుకుంటూ మందలను తరలిస్తుంటారు. ప్రస్తుతం చీడికాడ మండలం నలుమూలలా మందలు కాస్తున్నారు. గొర్రెలు, మేకలు పొలంలో వేసే పేడ, మూత్రం వలన ఆయా పంట భూముల్లో మిథేన్ వాయువు విడుదలై నేల సారవంతంగా మారుతుందని రైతుల నమ్మకం. ఒక్కొక్క మందలో సుమారు 500 వందల నుంచి 600 వందల వరకు గొర్రెలు, మేకలు ఉంటాయి. 10 నుంచి 12 మంది కాపరులు ఉంటారు. వీరు పొలాల్లో మందలు కాసేందుకు రైతుల నుంచి రోజుకు మందను బట్టి 4 నుంచి 10 కుంచాల బియ్యం, రూ.600 నగదు తీసుకుంటారు. ఈ విధంగా రైతు ఎకరాకు మూడు నుంచి నాలుగు రోజులపాటు మందకాపు కాయిస్తుంటారు. వీరు ప్రతిరోజు ఉదయం 9 గంటలకు, తిరిగి రాత్రి 7 గంటలకే భోజనం చేస్తారు. మధ్యాహ్నం ఖాళీ కడుపుతోనే ఉంటారు. ఒక్కొక్క మంద వద్ద వీరిలో ఒకరు పొలం వద్దే ఉండి మిగిలిన వారికి వంట చేస్తూ.. కొత్తగా పుట్టిన గొర్రె, మేక పిల్లలకు కాపలాగా ఉంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తాటి చెట్లు ఎక్కి తాటి కమ్మలతో అన్నం తినేందుకు బొల్లలు తయారు చేస్తారు. అలా చెట్టెక్కి కమ్మ బొల్లలు కట్టేవారికి అదనంగా ఒక వాటా అన్నం, లేదా బియ్యం అందిస్తారు. పొలం గల రైతుకు ఒక బొల్లన్నం ఇస్తారు. చింతపండు చారుతోనే సొంతూరు వెళ్లే వరకు గడిపేస్తారు. వీరు తినగా మిగిలిన బియ్యాన్ని ఆయా గ్రామాల్లో నిల్వచేసి సొంతూరు వెళ్లేటప్పుడు తీసుకెళతారు. అలా ఏడాదిలో సగం రోజులు వీరు అర్ధాకలితో, చలి, చీకటిలో ప్రాణాలకు తెగించి కాపలా కాస్తూ, కుటుంబ పోషణకు అంకితమవుతారు. ఇలా వీరు మందలను గ్రామాలకు తీసుకొచ్చి నాటి నుంచి తిరిగి ఇళ్లకు వెళ్లే నాటికి మరొక 100 నుంచి 150 పిల్లల వరకు పుడతాయని తెలిపారు.

రైతులతో విడదీయలేని అనుబంధం



పదేళ్లుగా ఈ ప్రాంతం వస్తుండంతో మాకు ఇవన్నీ సొంతూళ్లు అయిపోయాయి. మాతో రైతులందరూ బాగా ఉంటారు. ప్రతి రోజు ఒకరిని మా మంద వద్దకు మాతో భోజనానికి పిలుస్తాం. అలాగే వారు వస్తుంటారు. అదే మాకు పెద్ద సంతృప్తినిస్తుంది.

– బుద్దల ముసలినాయుడు, తిమ్మాపురం, భీమిలి మండలం

పిల్లలు వేరే వృత్తుల్లో..



మా తల్లిదండ్రులు మమ్మల్ని చదివించకుండా చిన్న నాటి నుంచి వారి వెంట మందలతో తీసుకెళ్లేవారు. ఈ చాలీచాలని బతుకులు మాతోనే అంతరించి పోవాలని మా పిల్లలకు వారసత్వంగా అందించదలుచుకోలేదు. అందువలనే వారు వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు.

– పల్లా అప్పన్న, వాయిలపాడు, ఎస్.కోట మండలం

పలు గ్రామాల్లో పీసా ఎన్నికలు



సూరంపాలెం పీసా ఉపాధ్యక్షుడు దొంగబాబు దొరకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న తహసీల్దార్



ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న పీసా కమిటీ సభ్యులు

గంగవరం : మండలంలోని సూరంపాలెం, దొరమామిడి, లక్కొండ గ్రామ పంచాయతీల్లో రాజుపేటలొద్ది, వేమనాపల్లి, దోనెలపల్లి, గొరగొమ్మి, దొరమామిడి గ్రామాల్లో సర్పంచ్‌లు బల్లెం శివదొర, ప్రతాప్ రెడ్డి, చంద్రకళ అధ్యక్షతన పీసా ఎన్నికలు నిర్వహించారు. సూరంపాలెం పంచాయతీ పీసా ఉపాధ్యక్షుడిగా కుంజం దొంగబాబు దొర, కార్యదర్శి గా సారపు బాలు దొర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దొరమామిడి పంచాయతీ పీసా ఉపాధ్యక్షుడిగా మడకం రామారావు దొర, కార్యదర్శింగా చోడి సంకురు దొర, లక్కొండ పంచాయతీ ఉపాధ్యక్షుడిగా ఓ.శివశంకర్ రెడ్డి, కార్యదర్శిగా కె.రాజారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి విశ్వనాథ్ వ్యవహరించారు. ఆముదాలబంద ఎంపీటీసీ పండా ఆదినారాయణ దొర , పంచాయతీ కార్యదర్శులు అజయ్, రాజకుమార్, భరత్ పాల్గొన్నారు.

పీసా ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు

రంపచోడవరం: ముసురుమిల్లి గ్రామ పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా వీకా నాగేశ్వరరావు, కార్యదర్శిగా కడబాల పెంటారెడ్డి గెలుపొందారు. పంచాయతీ కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన జరిగిన పీసా గ్రామ సభలో ఎన్నిక నిర్వహించారు. సర్పంచ్ కోసు రమేష్ బాబుదొర, ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వార్డు మెంబర్ వీకా సత్తిబాబు, బొబ్బా సత్యనారాయణ, కడబాల రామలక్ష్మి, ప్రభావతి పాల్గొన్నారు.

నిత్య జీవితంలో గణితం ఎంతో అవసరం

సీలేరు: గణిత శాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, నిత్య జీవితంలో ఎంతో అవసరమని ఏపీజెన్‌కో సూపరింటెండింగ్ ఇంజినీరు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక డీఏవీ పాఠశాలలో గణితశాస్త్ర దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాసరామనుజన్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఎగ్జిబిషన్‌ను తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను అందరినీ ఆకట్టుకున్నాయి. సోలార్ స్మార్ట్ విలేజ్, సేవ్ ఎర్త్-యాసిడ్ రెయిన్,చంద్రయాన్, జియో థర్మల్ ప్రాజెక్టులు ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, జెన్‌కో ఈఈ శ్రీనివాసరెడ్డి,గ్జిక్యూటివ్ ఇంజినీరు దుర్గా శ్రీనివాసరావు,అకౌంట్స్ ఆఫీసర్ ఇ.వి.వి. సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ఇంజనీర్లు, తల్లిదండ్రులు



క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వసుధ, అధ్యాపకులు

డిగ్రీ కళాశాలలో...

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ ఆధ్వర్యంలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రెజంటేషన్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

కాఫీ కొనుగోలుకు పెరుగుతున్న పోటీ

▶7వ పేజీ తరువాయి

సంఘాలు కాఫీ పండ్లను రూ.45 నుంచి రూ.50కు రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తున్నాయి. పక్వానికి వచ్చిన పండ్లను నేరుగా పల్పింగ్ యూనిట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తే కిలోకు రూ.60 ధర చెల్లిస్తామని ప్రకటించాయి. అంతర్జాతీయ మార్కెట్లో ధరలకు అనుగుణంగా ధరలు నిర్ణయించి కొనుగోలు చేస్తున్నామని రైతు ఉత్పత్తిదారుల సంఘాల డైరెక్టర్లు తెలిపారు.

జీసీసీ కాఫీ ధరల పెంపు

చింతపల్లి: గిరిజన సహకార సంస్థ కాఫీ ధరలను పెంచినట్లు ఆ సంస్థ చింతపల్లి డివిజనల్ మేనేజర్ దేవరాజ్ తెలిపారు. గతంలో కాఫీ పార్చిమెంట్ రూ.285, చెర్రి రూ.150, రొబస్టా రూ.80 చొప్పున కొనుగోలుకు నిర్ణయించిందన్నారు. వీటిని పెంచుతూ ధరల్లో మార్పు చేసిందన్నారు. ఇప్పుడు పార్చిమెంట్ రూ.320, చెర్రి రూ.170, రొబస్టా రూ.100 చొప్పున కొనుగోలుకు నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. నెలాఖరునుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. గిరిజన కాఫీ రైతాంగం దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. తమ సంస్థ పెంచిన ధరలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఎకో పల్పింగ్ యూనిట్‌లో కాఫీ పప్పును ఆరబెడుతున్న మహిళ

టన్ను ఫలసాయం విక్రయించా



ఐదు ఎకరాల్లో కాఫీ తోట ఉంది. ఈ ఏడాది సుమారు టన్ను మేర కాఫీ ఫలసాయాన్ని మాతోట రైతు ఉత్పత్తిదారుల సంఘానికి విక్రయించా. కిలో పండ్లకు రూ.50 ధర చొప్పున చెల్లించారు. అమ్మిన వెంటనే డబ్బులు చెల్లించారు. సొంత కాటాలతో తూకం వేసి అమ్మడం వల్ల మోసం జరిగే అవకాశం ఉండదు.

– ఇంగువ రామారావు, రామగెడ్డ, జీకేవీధి మండలం

కాఫీ రైతులకు బాసట



కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా కొనుగోళ్లు చేపట్టాం. అంతర్జాతీయ మార్కెట్లో ధరలకు అనుగుణంగా ధర నిర్ణయించాం. ఈ మేరకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశాం. మాతోపాటు మరికొన్ని సంస్థలకు కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి బాసటగా నిలిచేందుకు సిద్ధమయ్యాయి.

– వనపల చిన్నారావు, సీఈవో, మాతోట రైతు ఉత్పత్తిదారుల సంఘం, చింతపల్లి

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- నయంత యూనివర్సిటీ సీఈవో రంజన్ బెనర్జీ
- సెంచూరియన్‌లో ఘనంగా స్నాతకోత్సవం
- విద్యార్థులకు డిగ్రీల ప్రదానం




సమావేశంలో మాట్లాడుతున్న నయంత యూనివర్సిటీ సీఈవో ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ

నెల్లిమర్ల రూరల్: అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని నయంత విశ్వ విద్యాలయం సీఈఓ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ 4వ స్నాతకోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కృషి చేసినప్పుడే గొప్ప విజయాలు సొంతమవుతాయన్నారు. ఉన్నత స్థాయికి వెళుతూనే ఇతరులకు చేయూతనివ్వాలన్నారు. ఇతరుల జీవితాల్లో చిరునవ్వులు చూడగలిగినప్పుడే మంచి విజయాలు సాధించినవారమవుతామన్నారు. సెంచూరియన్ వర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎస్‌రావు విద్యార్థులు సాధించిన విజయాలను ప్రశంసించారు. వర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఏడేళ్ల వ్యవధిలోనే దేశంలో అగ్రశ్రేణి విశ్వ విద్యాలయాల్లో ఒకటిగా సెంచూరియన్ అవతరించిందన్నారు. వైస్ చాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ వర్సిటీను వ్యాపారం కోసం స్థాపించబడలేదని, శక్తివంతమైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 201 మంది విద్యార్థులకు డిగ్రీలు, మరో ఐదుగురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, 16 మందికి బంగారు పతకాలు, 8 మందికి నగదు ప్రోత్సాహకాలను వక్తలు అందజేశారు. కార్యక్రమంలో భువనేశ్వర్ వర్సిటీ వీసీ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ పల్లవి, పాలకమండలి సభ్యుడు, పారిశ్రామికవేత్త కుమార్ రాజా, డాక్టర్ పి.ఎస్.ఠాగూర్, ప్రొఫెసర్ కె.సి.బి.రావు, పీఎన్ఎస్‌వీ నరసింహం, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రీపై అవగాహన

చింతపల్లి: గిరిజన రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు రిజిస్ట్రీలో తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా మేలు కలుగుతుందని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. లోతుగెడ్డ,కుడుముసారి,కొలపరి గ్రామాల్లో రైతులకు అవగహన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ రిజిస్ట్రీ కార్యక్రమం ఈ నెల 26 నుంచి ప్రతి రైతు సేవా కేంద్రంలో ప్రారంభమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి రైతులు ఆధార్ కార్డుతో పాటు అనుసంధానమైన ఫోన్ నంబరు,జిరాయితీ పట్టా,రేషన్ కార్డు ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొమ్మంగి సర్పంచ్ లక్ష్మి వైఎస్సార్ సీనియర్ నాయకులు గుణబాబు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు సరిగ్గా నిర్మించక ఇబ్బందులు



అప్రోచ్ రోడ్డును చూపుతున్న పనసలపాడు గ్రామస్తులు

కొయ్యూరు: జాతీయ రహదారి 516 ఈ నిర్మాణంలో భాగంగా అప్రోచ్ రోడ్డును సరిగా నిర్మించకపోవడంతో ఇబ్బందులకు గురుతున్నట్టు పనసలపాడు గ్రామస్తులు దుచ్చరి జోగారావు,పద్మ శ్రీనివాస్ తదితరులు తెలిపారు. ఎం.మాకవరం పంచాయతీ పిట్టచలం నుంచి పనసలపాడుకు వెళ్లే రహదారిని సరిగా నిర్మించలేదని వారు చెప్పారు. ఈ మేరకు రోడ్డు వద్ద స్థానికులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిట్టచలం నుంచి పనసలపాడు వెళ్లేందుకు బీటీరోడ్డు ఉందన్నారు.అయితే జాతీయరహదారి వేసిన అధికారులు ఇక్కడ అప్రోచ్‌ను సరిగా వేయలేదన్నారు. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు మాత్రమే తిరుగుతున్నాయని, పెద్ద వాహనాలు రావడం లేదన్నారు.దీంతో ధాన్యం తరలించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకుంటే రోడ్డుపై ఆందోళన చేస్తామన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

– డీసీహెచ్ఎస్ కృష్ణారావు



వై.రామవరం సీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహిస్తున్న డీసీహెచ్ఎస్ కృష్ణారావు

వై.రామవరం: అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్) కె.కృష్ణారావు వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. స్థానిక సీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులు, మందుల నిల్వలను, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అందుతున్న వైద్యసేవలపై రోగులను ఆరా తీశారు. ఆస్పత్రికి అవసరమైన సౌకర్యాలపై సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఆస్పత్రి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల ఏవో చంద్రశేఖర్, వైద్యాధికారులు చైతన్యకుమార్, మోహన్, మస్తాన్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.